క్లుప్తంగా

మత్స్యకారుల ఆందోళన



జె.అన్నవరంలో ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ఏలేశ్వరం: మత్స్యశాఖ అధికారుల తీరుపై జె.అన్నవరంలో శనివారం మర్రివీడు గ్రామానికి చెందిన మత్స్యకారులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యశాఖ అధికారులు లైసెన్సుల విషయంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర తమ పట్ల వివక్షత చూపుతున్నారని విమర్శించారు. లైసెన్సు ఫీజులో అవకతవకలు చేస్తున్న రాజేంద్రపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై రాజేంద్రను వివరణ కోరగా ప్రభుత్వ నిబంధనల మేరకు పనిచేస్తున్నామని తెలిపారు. లైసెన్సు మంజూరులో వల పరిమాణం తదితర అంశాలను బట్టి ఫీజు ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు 18 మందికి లైసెన్సులు మంజూరు చేశామన్నారు. పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

మత్స్య సంపద అభివృద్ధికి కృషి

ఏలేశ్వరం: మత్స్య సంపద అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మత్స్యశాఖ జిల్లా అధికారి కృష్ణారావు అన్నారు. మండలంలోని జె.అన్నవరంలో శనివారం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనను ప్రారంభించారు. దీనిలో భాగంగా ఏలేరు ప్రాజెక్టులో 5.04 లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ మత్స్య కారులను ఆర్థికంగా ఆదుకొనేందుకు ప్రభుత్వం చేపపిల్లల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందని తెలిపారు. మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత్స్యశాఖ సంఘం చైర్మన్ రంగారావు, మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర, మత్స్యకారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రత్తిపాడు: స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహం, ప్రభుత్వ బీసీ వసతి గృహాల విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు గీతా సుధ ఆధ్వర్యంలో రెండు వసతి గృహాల్లోని సుమారు 200 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వేసవి వేళ విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ గీతాసుధ వివరించారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ ఎస్.సీత, హెల్త్ అసిస్టెంట్ జువ్వల రాజా, వసతి గృహాల సంక్షేమాధికారులు ఎం.సత్యనారాయణ, ఎం. శైలజారాణి, వైద్య ఆరోగ్య సిబ్బంది, రాచపల్లి పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ గరగల సంబరం

అన్నవరం: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే నూకాలమ్మతల్లి గరగల సంబరం శనివారం అన్నవరంలో ఘనంగా జరిగింది. శంఖవరం మండలం మండపం గ్రామంలో కొలువైన నూకాలమ్మ జాతరను ఏటా కొత్త అమావాస్యకు నిర్వహిస్తారు. కాగా జాతరకు వారం రోజుల ముందు మండపం గ్రామం నుంచి నూకాలమ్మతల్లి గరగలను ఊరేగింపుగా అన్నవరం తీసుకువచ్చి గ్రామంలో ఊరేగించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా శనివారం అన్నవరం వచ్చిన గరగలకు స్థానిక యూనియన్ బ్యాంక్ సెంటర్ వద్ద గ్రామస్తులు స్వాగతం పలికారు. గరగలను గ్రామంలో ఘనంగా ఊరేగించారు. రాత్రి పెదరావిచెట్టు వద్ద గరగల సంబరం నిర్వహించారు. సంబరంలో జబర్దస్త్ నటుడు దొరబాబు పాల్గొని సందడి చేశారు. కాగా అన్నవరానికి చెందిన పురగిరి క్షత్రియులు అత్తి కుటుంబ సభ్యులు నూకాలమ్మ జాతరకు ఏర్పాట్లు చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు శనివారం పరామర్శించి రూ. 10 ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన కట్టోజు ప్రసాద్ కుమార్తె హేమ శ్రీలక్ష్మి గత కొద్ది రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. బాధిత కుటుంబాన్ని మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, దోమలంక బాబ్జి పాల్గొన్నారు.

అపరాల కొనుగోలు కేంద్రం ప్రారంభం

కోటనందూరు: స్థానిక రైతుసేవా కేంద్రం-1లో అపరాల కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయశాఖ అధికారులు శనివారం ప్రారంభించారు. కందులకు కింటాల్ రూ.7550, మినుము రూ.7400, పెసర రూ.8682 చొప్పున కనీస మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందని ఏఓ చంద్రశేఖర్ తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏఈఓలు శివకుమారి, సురేష్, వీఏఏ జ్యోతి పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంకు అభినందనలు

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపో నూతన మేనేజర్ సుచరిత మార్గరేట్‌కు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు అభినందనలు తెలిపారు. శనివారం డీఎం సుచరితకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. డిపోలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి, డిపో ఆర్థిక పురోగతి సాధించడానికి సిబ్బంది కృషి చేయాలని డీఎం ఆకాంక్షించారు. అసిస్టెంట్ మేనేజర్ అప్పారావు, ఎంప్లాయీస్ యూనియన్ డిపో చైర్మన్ పైడిమళ్ల లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో నాణ్యమైన దిగుబడులు

- ఏపీపీఎన్‌ఎఫ్ డీపీఎం తాతారావు
- రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



వీరలంకపల్లిలో రైతులను సత్కరిస్తున్న అధికారులు

గోకవరం: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఏపీపీఎన్‌ఎఫ్ డీపీఎం తాతారావు అన్నారు. మండలంలోని వీరలంకపల్లిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రమైన రామకృష్ణా గార్డెన్స్‌లో శనివారం కోరుకొండ డివిజన్ 2025 ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ వర్క్‌షాప్ సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యానవనశాఖ, ఆత్మా తదితర శాఖల సమన్వయంతో నిర్వహించిన సదస్సుకు సుమారు 250 మంది రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీపీఎం తాతారావు మాట్లాడుతూ రైతులు పెట్టుబడిలేని ప్రకృతి సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులతో పాటు మంచి దిగుబడి వచ్చి లాభాలు ఆర్జిస్తారన్నారు. ఏడీపీఎం వలి, కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు, ఆత్మా బీటీఎం రాజశేఖర్, హెచ్‌ఓ రిని, ఏఓ రాజేశ్వరి తదితరులు రైతులకు పలు అంశాలను వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్న రైతులు కొరిపల్లి అప్పలస్వామి, గండి శ్రీనివాస్‌రావు, మహిళా రైతు బట్టేటి పాప, స్థానిక ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

శంఖవరం: రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. మండలంలోని శృంగధారలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన కాయగూరలు, ఆకు కూరల స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన నాణ్యమైన కాయగూరలు, ఆకు కూరలు తక్కువ ధరకే ప్రజలకు అందజేస్తునట్టు తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మణికంఠ, రజక్ తదితరులు పాల్గొన్నారు.



శృంగధారలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ గాంధీ

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కిర్లంపూడిలో పార్టీ శ్రేణులతో సమీక్షిస్తున్న ముద్రగడ గిరిబాబు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు
- కిర్లంపూడిలో పార్టీ శ్రేణులతో సమావేశం

కిర్లంపూడి: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సూచించారు. కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో ప్రత్తిపాడు నియోజకవర్గ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, నాయకులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజాసమస్యలు, తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను పార్టీ శ్రేణులు గిరిబాబు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ ప్రజల తరఫున పోరాటం చేయాలన్నారు. ప్రజల కోసం చేసే ఈ న్యాయ పోరాటంలో తాను పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని తెలిపారు. వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ గోళ్ల గోళ్ల సుధాకర్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాడిశెట్టి రాజా జన్మదిన వేడుకలు

కోటనందూరు: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా జన్మదిన వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. మండలం నలుమూలల నుంచి వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో భారీ కేక్ కట్ చేసి రాజాకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీపీ లగుడు శ్రీనివాసు మాట్లాడుతూ దాడిశెట్టి రాజా ప్రజా నాయకుడు అని కొనియాడారు. కూటమి ప్రభుత్వ దుశ్చర్యలను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు వెలగా వెంకట కృష్ణాజీ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని కోరారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, నాయకులు నల్లమిల్లి గోవిందు, జిగటాల వీరబాబు, సుర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. పి.అగ్రహారంలో పార్టీ మండల కన్వీనర్ బత్తుల వీరబాబు నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంచారు. రావికంపాడు, ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం, తొండంగి, తీరప్రాంత గ్రామాల్లో ఆయన అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, పార్టీ మత్స్యకార విభాగం నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, పార్టీ నాయకులు సాపిశెట్టి చిన్న, బెక్కం చంద్రగిరి, గోపాలపట్నం సర్పంచ్ కటకం శివ, పేకేటి హరికృష్ణ, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు అంగుళూరి సుశీలరాణి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పెదపూడి రమణ తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: బెండపూడిలో గ్రామసర్పంచ్ ఏలేటి దుర్గాదేవి ఆధ్వర్యంలో దాడిశెట్టి రాజా జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు ఆరుమిల్లి ఏసుబాబుచౌదరి, ఏలేటి ధర్మరాజు తదితరులు కేక్ కట్ చేసి సంబరాలు చేశారు.



పి.అగ్రహారంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ మండల కన్వీనర్ వీరబాబు, నాయకులు



కోటనందూరు పీహెచ్‌సీలో రోగికి పండ్లు, రొట్టె పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మసీదులో ముద్రగడ ప్రార్థనలు



కిర్లంపూడిలో మసీదులో ముస్లిం మత పెద్దలతో ముద్రగడ పద్మనాభం, గిరిబాబు

కిర్లంపూడి: స్థానిక మదీనా జామియా మసీద్‌లో శనివారం ముస్లింలు నిర్వహించిన నమాజ్‌లో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పాల్గొన్నారు. ముస్లింలు ఉపవాస దీక్షలతో నమాజ్ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో గణేషుల రాంబాబు, గణేశుల లక్షబాబు, పెంటకోట నాగబాబు, మత పెద్దలు మహమ్మద్ షాబుద్దీన్, షరీఫ్ సాబ్, ఇబ్రహీం, బషీర్ పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

తొండంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరగాల్సిన మండల సాధారణ సర్వసభ్య సమావేశం కోరంలేక వాయిదా పడింది. మండల పరిషత్‌లో 25 మంది సభ్యులకు గాను ఆరుగురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. సభ్యుల దామాషా ప్రకారం తొమ్మిది మందికి గానూ ఎనిమిది మంది మాత్రమే హాజరవ్వడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్టు ఎంపీడీఓ రాజేశ్వరరావు ప్రకటించారు. త్వరలో సమావేశం ఎప్పుడు నిర్వహించేది నిర్ణయించి ప్రకటిస్తామని చెప్పారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

గండేపల్లి: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో రెండు రోజుల పాటు జరిగిన జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025 కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు యువత నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడానికి, జాతీయ, ప్రపంచ సమస్యలపై స్పందించేందుకు వీలు కల్పించే వేదికగా ఈ యూత్ పార్లమెంట్ నిర్వహించామన్నారు. దీనిలో ప్రతిభ చూపిన విద్యార్థుల్లో 10 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశామన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూకే కో ఆర్డినేటర్ జి. శ్యామ్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ కో ఆర్డినేటర్ పి. వెంకటేశ్వరరావు, ప్రో వైస్ చాన్సలర్ రమశ్రీ, రిజిస్ట్రార్ జి.సురేష్ పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఆదిత్య ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి

కొండపోడు భూములకు పట్టాలివ్వాలి

ప్రత్తిపాడు: వంతాడ గిరిజన తండాలో కొండపోడు భూములను సాగు చేసుకుంటున్న తమకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఆ గ్రామ గిరిజనులు ధర్నా చేపట్టారు. సీపీఐ (ఎంఎల్) వినోద్‌మిశ్రా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేశ్వరరావు మాట్లాడుతూ ఏలేశ్వరం రేంజ్ లింగంపర్తి సెక్షన్‌లో ఉన్న కొండపోడు భూములను 40 ఏళ్లుగా వంతాడ గిరిజనులు సాగు చేసుకుంటున్నారన్నారు. వీరికి పట్టాలు మంజూరు కాకుండా కొంత మంది రాజకీయ నాయకులు మోకాలడ్డుతున్నారని విమర్శించారు. కనీస వసతులు లేని వంతాడ తండాలోని గిరిజనులు సాగు చేసుకుంటున్న కొండపోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అనంతరం తహసీల్దార్ ఎం,సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. గిరిజనులు కుడే రాఘవ, మాతే దుర్గబాబు, మాతే లోవరాజు, ఈరట చంటిబాబు, ఉల్లి లక్ష్మి, ఉల్లి తాతారావు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తుని: స్థానిక వీరవరపు పేట విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. పట్టణ పరిధిలోని గొల్లపేట, దివాణం వీధి, బాడవ వీధి, వేంకటేశ్వరస్వామి ఆలయం, వడ్ల బంగారమ్మ వీధి, పాత బజారు, బెల్లపు వీధి, నారాయణరాజు గారి వీధి, ప్రకాశం రోడ్డు, ముస్లీం వీధి, చిన్న వీధి, పెద్దవీధి, వీరవరపుపేట, కొత్త సూరవరం, కొబ్బరితోట, రామకృష్ణాకాలనీ, గవరపేట, ఉప్పరగూడెం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఏలేశ్వరం: ప్రస్తుత వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. మండలంలోని యర్రవరంలో శనివారం జలవనరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నీటిగుంతల నిర్మాణానికి ఎంపీపీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటపొలాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉపాధిహామీ పథకంలో ఫారం పాండ్‌లు నిర్మిస్తునట్టు తెలిపారు. మండలవ్యాప్తంగా నీటిగుంతలకు నిధులు మంజూరు చేశామన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఏపీఓ సత్యనారాయణ, మైరాల కనకరావు, బస్వా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదరణపై అవగాహన సదస్సు

ఏలేశ్వరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సూర్యనారాయణ అధ్యక్షతన ఆదరణ కార్యక్రమంపై వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ ఆదరణ కార్యక్రమం ద్వారా చేతివృత్తుల వారికి పనిముట్లు అందజేస్తునట్టు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



యర్రవరంలో నీటి గుంతలకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

మామిడి తోటల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్

తొండంగి: ప్రతికూల వాతావరణంలో మామిడి తోటలకు సోకిన తామర పురుగు తెగులు నివారణకు రైతులు సస్య రక్షణ చర్యలు పాటించాలని రామచంద్రాపురం ఉద్యాన కళాశాల ఎంటమాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ చిన్నబ్బాయి అన్నారు. మండలంలోని బెండపూడిలో నల్ల తామర పురుగు సోకిన మామిడి తోటలను శనివారం ఉద్యానవనశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల మామిడికి తెగుళ్ల బెడద అనే శీర్షికతో సాక్షిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో రామచంద్రాపురం నుంచి వచ్చిన శాస్త్రవేత్త చిన్నబ్బాయి క్షేత్రస్థాయిలో మామిడి చెట్లను పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివారణకు ట్రేసర్ లేదా స్పైనోసాడ్ మందు 34 మిల్లీలీటర్లు 140 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. జీవనియంత్రణ పద్ధతిలో బెవేరియ బెస్సియానా ఫంగస్‌ను మామిడితోటల్లో వదలడం వల్ల రెండేళ్లలో నల్లతామర పురుగును పూర్తిగా నివారించవచ్చన్నారు. ఆయన వెంట ఉద్యానవనశాఖాధికారి విజయలక్ష్మి, వీఏఏలు, వీహెచ్‌ఏలు, రైతులు ఉన్నారు.



బెండపూడిలో నల్లతామర పురుగు తెగులు సోకిన మామిడి చెట్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ చిన్నబ్బాయి

రత్నగిరిపై దుకాణాల్లో తనిఖీలు

అన్నవరం: స్థానిక రత్నగిరి దేవస్థానం, కొండ దిగువన గల పలు షాపుల్లో శనివారం కాకినాడ జోన్ లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దేవస్థానంలోని పలు షాపుల్లో ఎంఆర్‌పీ ధరల కన్నా అధికంగా ఫ్యాన్సీ వస్తువులు, ప్యాకేజీ డ్రింకింగ్ వాటర్, శీతలపానీయాలు, బిస్కెట్ ప్యాకెట్లు, ఇతర వస్తువులు విక్రయిస్తున్నట్లు తేలడంతో ఆయా షాపుల నిర్వాహకులపై ఎనిమిది కేసులు నమోదు చేశారు. లీగల్ మెట్రాలజీ ఉప నియంత్రికులు ఎస్.జనార్దనరావు, నియంత్రికులు సలీం, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్‌లు సరోజిని, వీఎస్ మోహన్, నాగేంద్ర కుమార్, వినియోగదారుల ఫోరం ప్రతినిధి కొమ్మూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

- ఘనంగా అంతర్జాతీయ జల దినోత్సవం
- నీటికుంటల ఏర్పాటుపై రైతులకు అవగాహన

కోటనందూరు: భూగర్భ జలాలను సంరక్షించడాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని ఎస్సార్‌పేటలో శనివారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. నీటి సంరక్షణపై ప్రజలు, ఉపాధి కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు. నీటిని వృథా పోనీయకుండా భూమిలో ఇంకే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధిహామీ పథకంలో మంజూరైన నీటికుంటలు (ఫారంపాండ్ల)ను పరిశీలించారు. ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలో 87 ఫారంపాండ్లు మంజూరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ డి.రాజగోపాల్, పంచాయతీ కార్యదర్శి ఎన్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో అంతర్జాతీయ జల దినోత్సవం, వరల్డ్ ఎర్త్ అవర్ కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. హైస్కూల్ హెచ్ఎం సీహెచ్‌వీవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు నీటి ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. తరగతుల వారీగా సేవ్ వాటర్ కమిటీలను ఏర్పాటు చేశారు. జీవరాశులకు మంచినీటిని అందించేందుకు ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. ఎర్త్ అవర్ సందర్భంగా రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకూ విద్యుత్ వినియోగాన్ని నిలిపివేయాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీకే మెహర్ విద్యార్థులకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు.



అప్పలరాజుపేటలో నీటికుంటను పరిశీలిస్తున్న అధికారులు

మద్దతు ధరకు పెసల కొనుగోలు

తుని రూరల్: ప్రభుత్వ మద్దతు ధరకు పెసలు సేకరించేందుకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మంజుల అన్నారు. తేటగుంట (ఎస్ఎన్ పట్నం) పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్వింటాల్ పెసలకు రూ.8,682 చొప్పున రైతులకు చెల్లిస్తామన్నారు. మార్క్‌ఫెడ్ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల ఆధారంగా గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అనంతరం కొనుగోలు కేంద్రంలో పెసలు విక్రయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ బి.అశోక్‌కుమార్, సొసైటీ సీఈఓ రమేష్, రైతులు పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం ×మూల౯ సందర్భంగా శనివారం అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టెం గోపీ, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

వైభవంగా కల్యాణోత్సవం

తొండంగి: మండలంలోని దానవాయిపేట బీచ్ రోడ్డులో వేంచేసిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు శంకరణం వెంకటరాజుశర్మ ఆధ్వర్యంలో పండితులు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భక్తుల తాకిడి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచిలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరకంచి, పరిసర గ్రామాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పండితుడు రామలక్ష్మణ సత్యప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం దేవస్థానం ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

కిర్లంపూడి: పాము కాటుకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీసు హెడ్ కానిస్టేబుల్ ఎస్.వెంకట రమణ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ముక్కొల్లు గ్రామానికి చెందిన అనపర్తి కృష్ణ (56) అదే గ్రామానికి చెందిన కోటాబత్తుల నందేశ్వరావుకు చెందిన పొలాన్ని కౌలు చేస్తున్నాడు. శుక్రవారం వ్యవసాయ పనుల నిమ్మిత్తం పొలానికి వెళ్లిన కృష్ణ పాము కాటుకు గురై స్పృహ కోల్పోయాడు. కుటుంబ సభ్యులు అతడిని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. మృతుడుకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు అనపర్తి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ ఎస్వీ రమణ తెలిపారు.

పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

కిర్లంపూడి: కులవృత్తుల వారికి ప్రభుత్వం అందిస్తున్న పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కులవృత్తి సంఘ పెద్దలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆదరణ-3 పథకంపై అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, ఏపీఓ నాయుడు పాల్గొన్నారు.

అన్నసమారాధన

గండేపల్లి: తాళ్లూరు మఠంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. వందలాది మంది భక్తులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. భక్తుల ఆర్థిక సహాయంతో అన్నదానం నిర్వహించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

హిజ్రాల కొవ్వొత్తుల ర్యాలీ

ఏలేశ్వరం: అనకాపల్లిలో హిజ్రా దీపును దారుణంగా హత్య చేసిన నిందితుడు బన్నీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణంలో హిజ్రాలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రధాన రహదారి మీదుగా బాలాజీచౌక్ వరకూ ర్యాలీ చేసి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిజ్రా దీపును కిరాతకంగా హత్య చేసిన బన్నీకి ఉరిశిక్ష విధించాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిషా, గీత, సౌమ్య, రక్షిత, రాధిక తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న హిజ్రాలు